మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
సోమవారం | 26 | జూన్ | 2023 | పేజీలు : 7

క్యారెట్ మాలల అలంకరణలో శ్రీదుర్గాభవానీ అమ్మవారు



2లో

# కరీంనగర్‌లో మొదలైన ఎన్నికల యుద్ధం

- విమర్శలు, ప్రతి విమర్శలతో రాజుకుంటోన్న వేడి
- గంగుల, బండిల సయోధ్యపై విపక్షాల విమర్శలు
- హద్దు దాటుతోన్న ఆరోపణలు

కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (మనం న్యూస్): దాదాపు ఆరు మాసాల తర్వాత జరుగనున్న ఎన్నికల కోసం కరీంనగర్ జిల్లా నేతలు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారు. విమర్శలు, ప్రతి విమర్శలతో అధికార బిఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బిజెపి ప్రజాప్రతినిధులు, నాయకులు నిత్యం వార్తల్లో నానుతున్నారు. ఒకరికి ధీటుగా మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటుండడంతో జిల్లా రాజకీయాల్లో వేడి రగులుకుంటోంది. ప్రధానంగా జిల్లాకు చెందిన మంత్రి గంగుల కమలాకర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక ఎంపి బండి సంజయ్‌ల మధ్య సయోధ్య అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై కాంగ్రెస్ నాయకులు చేస్తోన్న ఆరోపణలతో బిఆర్ఎస్, బిజెపి శ్రేణుల్లో కలవరం చోటుచేసుకుంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి తదనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల వరకు ఉప్పు, నిప్పుల్లా కొనసాగిన గంగుల, బండిలు రహస్య ఒప్పందాలతో కొనసాగుతున్నారని పేర్కొంటూ ఎఐసిసి సభ్యులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడంతో పాటు, మంత్రి గంగులపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడ్డారు. దీనికి ప్రతిగా బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సైతం పొన్నం పట్ల ఘాటు విమర్శలకు దిగారు. పొన్నం ప్రభాకర్‌ను ఔట్ డేటెడ్ వ్యక్తిగా మంత్రి గంగుల వ్యాఖ్యానించడం, దానికి పొన్నం మరింత ఘాటుగా వ్యక్తిగత ఆరోపణలకు దిగడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఆరోపణలు, ప్రత్యారోపణలకు పాల్పడుతున్నప్పటికీ, బండి, గంగుల అంశంపై బిజెపి నాయకులు మాత్రం నోరు మెదపకపోవడం గమనార్హం. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు సంజయ్‌పై కాంగ్రెస్ నాయకులు తరచుగా ఆరోపణలకు పాల్పడుతున్నప్పటికీ స్థానిక బిజెపి నాయకులు నోరెందుకు మెదపడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల జిల్లాలో

మిగతా 2లో..







## మూఢ నమ్మకాలు వీడని జనం

- కీడు సోకిందని గ్రామాన్ని వీడిన పీచుపల్లి ప్రజలు
- 12 గంటల పాటు ఇళ్లకు తాళాలు వేసి పొలిమేరలో ఉన్న జనం



2లో

## బిఆర్ఎస్ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయి

- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు
- పలువురు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల తీరే అందుకు నిదర్శనం

పిసిసి కార్యదర్శి గడ్డం వినోద్



7లో

# కరీంనగర్‌లో మొదలైన ఎన్నికల యుద్ధం

మొదటి పేజీ తరువాయి..

చోటుచేసుకుంటున్న పరిణామాలు, మంత్రి అనుచరుల కారణంగా జరుగుతున్న వివాదాస్పద ఘటనల పట్ల బిజెపి వర్గాలు స్పందించకపోవడం, కాంగ్రెస్ చేస్తోన్న ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లవుతోందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గత నెల రోజుల క్రితం రేకుర్తి గ్రామంలో నిరుపేద మైనార్టీల ఇండ్లను కూల్చివేసిన ఘటనలో మంత్రి అనుచరులే ప్రధాన పాత్ర పోషించారన్న ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు మినహా మిగతా విపక్షాలన్నీ ఈ ఘటన పట్ల బాధితుల పక్షాన నిలిచి ఆందోళనలు చేపట్టాయి. ఈ విషయంలో ఇప్పటి వరకు మంత్రి గంగుల, ఎంపి సంజయ్‌లు ఎలాంటి ప్రకటన చేయకపోవడం అటు బాధితులు, ఇటు పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. ఇదే గాకుండా జిల్లాలోని భూములతో పాటు రాష్ట్ర రాజధానిలోని భూముల ఆక్రమణల వ్యవహారంలో గంగుల కమలాకర్‌పైన పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవే గాకుండా గంగులపై వ్యక్తిగత ఆరోపణలకు దిగడమే కాకుండా పరుష పదజాలాన్ని కూడా వినియోగించారు. ఆయన మాటలను మీడియా వ్యక్తీకరించలేకపోయినప్పటికీ, కాంగ్రెస్ శ్రేణులు మాత్రం సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం చేశాయి. ఈ విధంగా జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతూ, అవమానకర రీతిలో ఆరోపణలకు పాల్పడడం పట్ల ప్రజల్లో పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకులు ఇలాంటి ప్రకటనలివ్వడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలను పార్టీల వరకే పరిమితం చేయాలే తప్ప వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేస్తూ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడం ఆరోగ్యకర వాతావరణం కాదన్న అభిప్రాయాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఎం. సత్యనారాయణరావు మనవడు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మెన్నేని రోహిత్‌రావు నిర్వహించిన కార్యక్రమం, విసిరిన సవాళ్లు బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య వేడిని రగిలిస్తున్నాయి. గంగుల కమలాకర్, బండి సంజయ్‌లు చీకటి ఒప్పందాలు చేసుకుని అవగాహనతో అన్నింటా ముందుకు సాగుతున్నారని పేర్కొంటూ నగరంలోని మహాశక్తి దేవాలయంలో వివరాలతో సహా పాత్రికేయుల సమావేశం నిర్వహించేందుకు యత్నించారు. ఈ క్రమంలో బిజెపి, కాంగ్రెస్ శ్రేణుల మధ్య గొడవ చెలరేగే అవకాశముందన్న అనుమానంతో పోలీసులు రోహిత్‌రావును అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన దుర్గా అమ్మవారి పటాన్ని తీసుకువచ్చి, బిఆర్ఎస్‌తో తామెలాంటి అవగాహన, ఒప్పందాలతో ముందుకు సాగడం లేదని, గంగులతో చీకటి ఒప్పందాలు నిజం కాకపోతే బండి సంజయ్ కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో అమ్మవార్ల సాక్షిగా ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. దీంతో మంత్రి, ఎంపిల వ్యవహారం అంశంపై మరింత అగ్గి రాజుకున్నట్లయింది.

## క్యారెట్ మాలల అలంకరణలో శ్రీదుర్గాభవానీ అమ్మవారు



కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్)ః కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికా రి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషా డమాసం శాఖాంబరీ ఉత్సవా ల్లో భాగంగా ఆదివారం శ్రీదు ర్గాభవానీ అమ్మవారిని క్యారెట్ మాలలతో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారు లు అమ్మవారికి విశేష హారతు లిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు




కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్)ః జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-13 ఓపెన్ చదరంగా పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బలగం మూవీ ఫేమ్ బాలు ఖ్యాతి, ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జనార్ధన్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో చదరంగ టోర్నమెంటును ఇంత ఘనంగా రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పోటీల సందర్భంగా చేసిన ఏర్పాట్లు జాతీయ స్థాయిలో ఉన్నాయన్నారు. టోర్నీ నిర్వాహకులు, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్లు కంకటి అనూప్‌కుమార్, కంకటి కనకయ్య అభినందించారు. చదరంగా క్రీడ ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని, జీవితాన్ని నేర్పిస్తుందని, పిల్లల్ని ఈ క్రీడారంగంలో ప్రోత్సహిస్తే ఘనమైన లాభం జరుగుతుందని వారు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో అతిపెద్ద చెస్ టోర్నమెంట్ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ఓపెన్ లో అండర్ -13 లో విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, మెడల్స్ , సర్టిఫికెట్స్ అందించడం జరిగిందని, వందలాదిమంది విద్యార్థులు ఈ క్రీడ పట్ల ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని పొందడం తనకెంతో ఆనందం కలిగించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్మెంట్ కోర్ కమిటీ సభ్యులు అమిత్ పాల్ సింగ్, సమీర్ కుమార్, కంది రవి, రిషి పాల్ సింగ్, బెల్లం సంపత్, దయ భేటీ, జగన్, కుమార్, సతీష్ బాబు, రవికుమార్, తిరుపతిరెడ్డి, సృజన్ ముఖ్య అతిథులతో కలిసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇంకా గొప్పగా టోర్నమెంట్ నిర్వహించడానికి సహకరించిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్, వికన్వెన్షన్, వెంకట్ ఫౌండేషన్, సిద్ధార్థ స్కూల్, మల్టీ బైట్, సురభి ట్రావెల్స్, కిడ్స్ మాల్ యాజమాన్యానికి టోర్నమెంట డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె అనిత, ఆర్బిటార్లు, తల్లిదండ్రులు ,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలు వీడని జనం

**- కీడు సోకిందని గ్రామాన్ని వీడిన పీచుపల్లి ప్రజలు**

**- 12 గంటల పాటు ఇళ్లకు తాళాలు వేసి పొలిమేరలో ఉన్న జనం**

చిగురుమామిడి, జూన్ 25 (మనం న్యూస్)ః అరచేతిలో విశ్వాన్ని చూస్తోన్న ప్రస్తుత సమయంలో ఇంకా అనేక మంది మూఢ నమ్మకాల మధ్య కొట్టుమిట్టాడుతూనే ఉన్నారు. మాయలు, మంత్రాలు, చేతబడి, కీడు సోకడం వంటి అనాచారాలను నెత్తినపెట్టుకుంటున్న ప్రజలు మూఢ విశ్వాసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. గ్రామానికి కీడు సోకిందని ఓ పూజారి చెప్పిన మాటలను నమ్మిన గ్రామ ప్రజలు 12 గంటల పాటు ఊరిని వదిలేసిన ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. దాదాపు ఆరు మాసాల క్రితం విద్యుత్ ఘాతానికి గురై గ్రామానికి చెందిన స్వామి రెడ్డి అనే వ్యక్తి మృతి చెందడం, తదనంతరం పలువురు మృత్యువాతపడడంతో ఆందోళన చెందిన గ్రామస్తులు స్థానిక పూజారిని ఆశ్రయించారు. వారి భయాన్ని ఆసరాగా చేసుకున్న సదరు పూజారి ఊరికి కీడు సోకిందని, 12 గంటల పాటు ఇండ్లకు తాళాలు వేసి ఊరి పొలిమేరల్లో గడపాలని సెలవిచ్చారు. దీంతో ఆదివారం ఉదయం ఆరు గంటలకల్లా ఊరు ఊరంతా ఖాళీ అయ్యింది. కనీసం వాకిళ్లు కూడా శుభ్రం చేయకుండా, గ్రామంలోని పిల్లా పెద్దా అంతా కలిసి కనీసం కాలకృత్యాలు కూడా తీర్చుకోకుండా ఉదయం ఆరు గంటల వరకే ఊరి పొలిమేరల్లోకి చేరుకున్నారు. అక్కడే చెట్లు చేమలను ఆశ్రయంగా చేసుకుని రోజూవారీ కార్యక్రమాలను కొనసాగించారు. ఊరి పొలిమేరల్లోనే వంటా వార్పులు నిర్వహించుకుని భోజనాలు చేసి సేదదీరిన ప్రజలు, తిరిగి సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎవరిళ్లకు వారు చేరుకున్నారు.



# మేయర్ సునీల్ రావుకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీనే

**కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుజిత్‌రావు**

**ఆటో డ్రైవర్లతో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం**

కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్)ః కరీంనగర్ మేయర్ సునీల్‌రావు గతాన్ని మరిచి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని, ఆయనకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని డిసిసి ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌రావు హితవు పలికారు. సునీల్ రావుకు యూత్ కాంగ్రెస్ పదవినివ్వడంతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయ ప్రాధాన్యతనిచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల విమర్శలకు పాల్పడడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నగరంలోని గోదాంగడ్డ అయ్యప్ప దేవాలయం ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులతో ఆదివారం ఉదయం సుజిత్ రావు బ్రేక్‌ఫాస్ట్ చిట్ చాట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పొన్నం ప్రభాకర్ ఎంపిగా ఉన్న హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమున్నత న్యాయం జరుగుతుందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు. స్థానిక మేయర్ సునీల్‌రావు వల్ల నగర ప్రజలకే కాకుండా, ఆయన డివిజన్ ప్రజలకు కూడా ఒరిగిందేమీ లేదన్నారు. రాజకీయ జీవితాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేయడమే కాకుండా, రాజకీయంగా ఎదిగడానికి కారణమైన నేతల పట్ల అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని సునీల్‌రావును దుయ్యబట్టారు. సునీల్‌రావుతో పాటు ఆయన సతీమణి కాంగ్రెస్ పార్టీ తరపున కార్పొరేటర్‌గా గెలిచి, ద్రోహపూరితంగా బిఆర్ఎస్‌లో చేరి, ప్రజల్లో గుర్తింపునిచ్చిన కాంగ్రెస్ గురించి చులకనగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ అవినీతి, నిరంకుశ పాలన పట్ల ప్రజలు విసిగి వేసారని, రాబోయే ఎన్నికల్లో సురక్షిత పాలననందించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని సుజిత్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నం శ్రీనివాస్, అనిల్, నవాజ్ హుస్సేన్, బుర్ర నాగరాజు, భరత్, సంతోష్, ఆటో యూనియన్ అధ్యక్షులు గుడాల రవి, ముజ్జు, ముజాయిద్, జాఫర్, సదానందం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## దంత సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### దంత వైద్యులు సృజన



జగిత్యాల, జూన్ 25 (మనం న్యూస్)ః దంత సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే ఎలాంటి వ్యాధులు దరిచేరవని జగిత్యాలకు చెందిన ప్రముఖ దంత వైద్యురాలు సిహెచ్. సృజన సూచించారు. ఆదివారం జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో జగిత్యాలకు చెందిన సృజన దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలువురిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఆరు నెలలకోసారి వైద్యులను సంప్రదించి పరీక్షించుకోవాలని సూచించారు. గతంలో ఇంట్లో శుచి, రుచికరమైన, మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని వండేవారని దాంతో ఆరోగ్యకరమైన భోజనం తినేవారమన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవన విధానం వల్ల ఇంట్లో కాకుండా ఎక్కువ శాతం బయటి మసాలాలతో కూడిన ఆహారం తింటున్నారని, దానివల్ల నోటి, దంత సమస్యలు తలెత్తే ప్రమాదముందని, చిరు తిళ్లకు దూరంగా ఉండాలని సృజన ప్రజలకు సూచించారు. ఎలాంటి దంత సమస్యలున్నా తమ ఆస్పత్రిలో సంప్రదించాలని, తక్కువ ఖర్చులోనే చికిత్సనందిస్తామని ఆమె తెలిపారు.

## ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం

## మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి



సిరిసిల్ల టౌన్, జూన్ 25 (మనం న్యూస్)ః డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని వాళ్ళందరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు అందించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్పందించిన ఆమె ఈ విషయాన్ని సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ , నాయకులు గోవిందు లక్ష్మణ్ , సందుపట్ల పోచమల్లు , రాజశేఖర్ , మోర తిరుపతి , నల్ల బాబు , సప్న , కవిత , స్వరూప , కీర్తన తదితరులు పాల్గొన్నారు.

### తాడికల్ డెయిరీ అధ్యక్షులుగా రమణారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



శంకరపట్నం, జూన్ 25 (మనం న్యూస్)ః కరీంనగర్ పాల ఉత్పత్తి దారుల సంస్థ తాడికల్ గ్రామ అధ్యక్షులుగా నరహరి రమణారెడ్డి ఏడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో డెయిరీ సభ్యులు ఆయన అధ్యక్షతను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ తనపై నమ్మకంతో ఏడుసార్లు అధ్యక్షులుగా చేసినందుకు పాల ఉత్పత్తిదారులకు వెన్నంటి ప్రోత్సహిస్తానని, తాడికల్ గ్రామంలోని పాల ఉత్పత్తి సంస్థ ను అభివృద్ధి పథంలో నడిపించే లక్ష్యంగా జిల్లాలో మంచి గుర్తింపు తీసుకువస్తానని తెలిపారు.

# ముదిరాజుల ఆధ్వర్యంలో

# కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్

చిగురుమామిడి, జూన్ 25 (మనం న్యూస్)ః ముదిరాజ్ కులానికి చెందిన కెమెరామెన్ అజయ్‌పై ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చేసిన దాడికి నిరసనగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను గ్రామంలో ఊరేగించి చౌరస్తాలో దహనం చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘ నాయకులు మాట్లాడుతూ మీడియా ప్రతినిధి అని కూడా చూడకుండా దాడి జరపడంతో పాటు కులం పేరిట అసభ్య పదజాలంతో దూషించిన కౌశిక్ రెడ్డిని తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 24గంటల్లోగా కౌశిక్ రెడ్డి ముదిరాజులకు క్షమాపణ చెప్పని యెడల భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని, కౌశిక్ రెడ్డి ఇంటిని, కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గూళ్ల బాలయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కడారి రాజమల్లు, మాజీ అధ్యక్షులు గూళ్ల కనుకయ్య, సంఘ సభ్యులు గూళ్ల వెంకటేశం, గూళ్ల బాలయ్య, పిల్లి మల్లేశం, పిల్లి శ్రీనివాస్, పిల్లి తిరుపతి, పిల్లి వేణు, హనుమండ్ల సత్యనారాయణ,దామ శ్రీనివాస్, పిల్లి యాదగిరి, పోలవేణి సంపత్, గూళ్ల నాగరాజు,



గూళ్ల సంపత్, గూళ్ల సాయికృష్ణ, పిల్లి సారయ్య, పిల్లి గణేష్, పిల్లి శేఖర్, గజ్జెల శ్రీను, పిల్లి మహేష్, గూళ్ల శ్రీనివాస్, గూళ్ల రమేష్, బొల్లి రవి, బొల్లి కొమురయ్య, బొల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ ఇంటర్ గ్రూపు పోటీల్లో

## పారమిత ఎన్‌సిసి కేడేట్ ప్రతిభ



కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 25 (మనం న్యూస్)ః నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల 9 వ తరగతి విద్యార్థి బి. రేవంత్ కౌశిక్ జులై మాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడలో జరుగనున్న ఇంటర్ గ్రూప్ ఫైరింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఇటీవల ఎన్‌సిసి గ్రూప్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ఇంటర్ బెటాలియన్ పోటీల్లో కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, సంగారెడ్డి బెటాలియన్లకు చెందిన కేడెట్లు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైరింగ్ విభాగంలో రేవంత్ కౌశిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, కాకినాడలో జరుగబోయే ఇంటర్ గ్రూప్ పోటీలకు అర్హత సాధించి, తెలంగాణ 9వ బెటాలియన్ సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ చేతుల మీదుగాప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రేవంత్ కౌశిక్ ను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినంధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, యువియం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజి, ప్రశాంత్, కవిత ఏస్ఓడి తిరుపతిరావు, ఎన్‌సిసి అధికారి రాంసాయి, ఎక్స్ సర్వీస్ మెన్ రమేష్, సమన్వయ కర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట

## యోధులను సన్మానించిన విహెచ్‌పి

కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్)ః దేశంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధులను విశ్వహిందూ పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో ఘనంగా సన్మానించారు. ఎమర్జెన్సీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో విశ్వహిందూ పరిషత్ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, దేశంలో 1975 జూన్ 25వ తేదీ చీకటి రోజుగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. కోమల ఆంజనేయులు, కొమరవెల్లి సదానందం, మంతెన శ్రీమన్నారాయణ, జోగినిపల్లి సంపత్ రావు, పలకల రాజిరెడ్డి లను ఈ సందర్భంగా గోరక్షక్ విభాగ్ ప్రముఖ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడికృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు కళ్లెం వాసుదేవ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుల్లెల పవన్, గుగ్గిళ్ళపు రమేష్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### శిశుమందిర్ పాఠశాలకు రూ.5 లక్షల విరాళం

కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్)ః కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్మిస్తోన్న నూతన భవనంలో పిన్నింటి మణికంఠ నిఖిల్ రెడ్డి జ్ఞాపకార్థం ఒక గది నిర్మించడానికి అతడి తల్లిదండ్రులు పిన్నింటి ఇంద్ర కరుణాకర్ రెడ్డి ఆదివారం ఐదు లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షులు డాక్టర్ రమణాచారి, రజనీప్రియ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, సంక్షేమ ట్రస్ట్ నిర్వహకులు రాజిరెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి, పూర్వ విద్యార్థి విశ్వనాథ్, వినోద్ పాల్గొన్నారు.



# అభివృద్ధి పై నోరు జారితే ప్రజలే కర్రు కాల్చివాత పెడతారు

**- నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కనిపించడం లేదా**

**- నీవు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏమి అభివృద్ధి చేశావో ప్రజలకు వివరించు**

**- ప్రభుత్వ కార్యాలయాలపై రాద్ధాంతం నీ అవివేకానికి నిదర్శనం**

**- మున్సిపల్ ఆత్మీయ సమ్మేళనంలో ధ్వజమెత్తిన పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**



సుల్తానాబాద్,జూన్ 25 మనం న్యూస్ : కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పాలన కొనసాగిస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరు పారేసుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.ఆదివారం మున్సిపల్ పరిధిలోని ఎస్వీర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గజమాలతో భారీ స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే మూడోసారి ప్రజలే తగిన గుణపాఠం చేప్తారని 9 సంవత్సరాల ప్రభుత్వ పరిపాలనలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి నీకు కనపడటం లేదా అని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు గ్రామాల్లో తిరుగుతూ చేసిన అభివృద్ధి అంతా తానే చేశానని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించాలని అన్నారు. 9 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి ప్రజలు గమనిస్తున్నారని సుల్తానాబాద్ మున్సిపల్‌లో ఐదు కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టుతున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్ల అసమర్థతతో 18 లక్షల రూపాయల అభివృద్ధి పనులు ఆగిపోయాయని ఆరోపించారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో పూసాల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిష్టం ఏర్పాటు చేపడుతున్నామని స్పష్టం చచేశారు. సుల్తానాబాద్.సుల్తానాబాద్ పెద్ద చెరువు ఆర్‌ఆర్‌ఆర్‌లో మంజూరు అయిన నీటి నిల్వ ఎక్కువగా ఉండటం వలన సాధ్యం కాలేదని అన్నారు. అంబేద్కర్ విగ్రహం నుండి గట్టపల్లి రోడ్డు వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేసి నూతన రోడ్డును నిర్మాణం చేస్తున్నట్లు నీరుకుల్లా రోడ్డు రోడ్డు వెడల్పు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి అన్నారు.సుల్తానాబాద్ మున్సిపల్ ప్రజలకు నిరంతర త్రాగునీటి సరఫరా కోసం శాశ్వత పరిష్కారం చేసేందుకు అండర్ గ్రౌండ్ పైప్ లౌన్ నిర్మాణం కోనసాగుతుందని పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం కోసమే 10 కిలోమీటర్లు ఉన్న జిల్లా కేంద్రానికి ఐసిడిఎస్ కేంద్రాన్ని తరలించడం జరిగిందని ఇవేమీ తెలియకుండాప్రభుత్వ కార్యాలయాలన్నీ పెద్దపల్లికి తరలించుకుపోతున్నారని అనడం వారి అవివేకానికి నిదర్శమని అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేనటువంటి సంక్షేమ పథకాలన్నీ కేవలం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రభుత్వ హాయమంలోనే ప్రజలకు అందుతున్నాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. అంతే కాకుండా సీఎం కేసీఆర్ వికలాంగులకు నాలుగువేల పదార్ల పింఛన్ అందిస్తామని మంచిర్యాల సభలో ప్రకటించారని గుర్తుచేశారు. రానున్న రోజులలో బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చిన వెంటనే 2000 రూపాయలు ఉన్న పింఛను 3000 చేసే అవకాశం ఉందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతేకాండా సింగిల్ సింగిల్ విండో ద్వారా రైతులకు ఎరువులను నిరంతరం సరఫరా చేస్తున్నామని క ళ్యాణ లక్ష్మి,షాధి ముబారాక్,కేసీఆర్ కి ట్టు ద్వారా మహిళలకు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కింది అన్నారు. సుల్తానాబాద్‌లో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చి దిద్దుతున్నామని పోస్టుమార్టం గదిని నూతనంగా నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఆధార్ సెంటర్‌ను ఈ కార్యలయాన్ని తిరిగి సుల్తానాబాద్ లోనే పునప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత రమేష్‌గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్‌గౌడ్,సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీశ్రీనివాస్,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్‌రావు,మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సుమతా కృష్ణ,కౌన్సిలర్లు పారుపల్లి జ్ఞానేశ్వరి గుణపతి,కూకట్ల గోపి,గుర్రాల శ్రీనివాస్,రేవెల్లి తిరుపతి, పాసెడ్ల మమత సంపత్,అనుమాల అరుణ బాబురావు,గౌట్టం లక్ష్మి,బిఆర్ఎస్ పార్టీ నేతలు తిప్పారపు దయాకర్,ఆరేపల్లి ఇలారావు,యూత్ నేతలు వాయిద్ కనవేన సతీష్,గౌట్టం మహేష్,సాజిద్,సర్వర్,రఫీక్,మాజీ ఎంపిటిసి సభ్యులు ఆశాలు ఉస్తేం రవీందర్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్,ఆరెపల్లి సర్వేశ్,రాజోజుల శివల్లతో పాటు 15 వార్డులకు సంబంధించిన మహిళలు పెద్ద సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోశాల నిర్మాణానికై ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేత



సుల్తానాబాద్,జూన్ 25 మంన న్యూస్ : సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యాదవనగర్ లో నిర్వహించబడుతున్న శ్రీ ధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో, తాత్కాలిక రేకుల షెడ్డులో గోవులను సంరక్షించడం జరుగుతుంది. గోశాల నిర్వహణానికి సరిపడే స్థలం లేక గోశాల నిర్వాహకులకు గోవులను పోషించడం కష్టంగా మారింది. ఆదివారం రోజున శ్రీ ధర్మశాస్త్ర ఫౌండేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్‌రావు కు హైదరాబాద్ లోని తన నివాసంలో గోశాల శాశ్వత నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. అనంతరం గోశాల ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ కేవలం 6 గోవులను పోషించే స్థలంలో 15 గోవులను పోషించే స్థలంలో 15 గోవులను పోషించడం జరుగుతుందని,దీనితో గోవుల పోషణ కష్టంగా మారిందని దాతలతో పాటు,ప్రభుత్వం స్పందించి గోశాల నిర్మాణానికి స్థలంలో పాటు,వాటికి గ్రాసాన్ని అందించాలని గోశాల నిర్వాహకులు కోరారు.వినతి ప్రతం అందించిన వారిలో గోశాల ప్రధాన కార్యదర్శి నూక రామదాస్,గోశాల నిర్వహణ సభ్యులు పిట్టల పరమేష్,దాసోహం గోపి,సుంక మహేష్,బోయిని వినోద్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేస్తాం

రామగిరి,జూన్ 25 మనం న్యూస్ : రామగిరి మండలం సెంటనరీకాలనీలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడపగడపకు బిజెపి నినాదంలో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు సెంటనరీకాలనీ షాపింగ్ కాంప్లెక్స్ లో ప్రతి షాప్‌కి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారదర్శక పాలనను వివరించి ప్రతి షాప్‌కి నరేంద్రమోడీ పథకాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి మండల బిజెపి ఇంచార్జ్ మోలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే దేశ అభివృద్ధి అని 9 సంవత్సరాల కేంద్ర ప్రభుత్వం పరిపాలనలో గ్రామాలకు డైరెక్ట్‌గా నిధులు ఇచ్చిన ఘనత బిజెపి ప్రభుత్వందే అని గతంలో రాష్ట్రాలను నిధులు ఇస్తే ముఖ్యమంత్రులు ఇష్టారాజ్యంగా వారికి నచ్చిన నియోజకవర్గాలలో నిధులు మరలించేవారు కానీ ఇప్పుడు దేశ ప్రధాని గ్రామాలకు ఇవ్వడం వలన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి అని రాష్ట్రా ప్రభుత్వం చేసే ప్రతి పనిలో కేంద్రం వాటా ఉందని ప్రజలు గమనించాలని రాబోయే రోజుల్లో మంథనిలో భారతీయ జనతాపార్టీ జెండా ఎగరవేస్తామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ,సోషల్ మీడియా మంథని నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ తోట్ల రాజు,సీనియర్ నాయకులు పెద్దుల్ల ఐల్లయ్య,స్రిమల్ల తిరుమలు,మండల యువ నాయకులు కుంట చక్రి,తీగల



శ్రీధర్,మెరుగు శ్రీకాంత్,కందుల రమేష్,జంగపల్లి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



## నరేష్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

### జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

రామగిరి,జూన్ 25 మనం న్యూస్ : బిఆర్ఎస్ పార్టీ మాజీ రామగిరి మండల యూత్ అధ్యక్షుడు గ్యారబోయిన నరేష్ మృతి తీరని లోటని పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో ఆయనకి నివాళులు ఆర్పించి కుటుంబ సభ్యులను ఓదర్చారు.వీరితో పాటు జెడ్పీటీసీ మ్యాదరవేన శారధ కుమార్,టిబిజికేఎస్ గౌరవ అధ్యక్షులు కింగర్ల మల్లయ్య,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్,సీనియర్ ప్రాతికేయులు పీవీ రావు,టిబిజేకేఎస్ వైస్ ప్రెసిండెంట్ గౌతమ్ శంకరయ్య,దేవ శ్రీనివాస్,ఉపసర్పంచ్ దామర శ్రీనివాస్,చిందం రమేష్,ఒర్రే సురేష్,చిందం సమ్మన్న,బత్తిని ప్రశాంత్‌గౌడ్,కొండం శ్రీనివాస్,కోదురుపాక సాయి నివాళులు ఆర్పించారు.

## ఎస్సీ వసతి గృహాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



పెద్దపల్లి, జూన్ 25(మనం ప్రతినిధి): 2023–24సంవత్సరానికి గాను మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్లకు కోరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి ఎస్సీ వసతి గృహ అధికారి కంచర్ల శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలలో అడ్మిషన్లు పొందగోరే విద్యార్థులకు దరఖాస్తు ఉచితంగా అందిస్తున్నట్లు పూర్తి చేసిన దరఖాస్తుకు ఆదాయ, కుల,విద్య సంబంధిత పత్రాలను జతచేసి ఆయా వసతి గృహ అధికారులకు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేది గడువు లేదని, పూర్తి వివరాలకు వసతిగృహ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



వీణవంక–జూన్25(మనం న్యూస్): ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌ల పట్ల అసభ్యపదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ ఆదివారం మండలకేంద్రంలో ముదిరాజ్ కులసంఘం నాయకుల ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి జిఎస్ఆర్‌చానల్ విలేఖరిని చితకబాది ఇష్టారీతిగా ముదిరాజ్‌లను దూషించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే ముదిరాజ్ కులస్థులకు కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ లందరూ ఐక్యమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొలిపాక తిరుమల్, యూత్ అధ్యక్షులు మోటం వెంకటేష్, కోర్కల్ , మామిడాలపల్లి ,కిష్టంపేట,బేతిగల్ గ్రామాల అధ్యక్షులు కొలిపాక స్వామి, శంకర్,తీగల సంపత్,చొప్పరి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎల్లారెడ్డికి ఘన సన్మానం



వీణవంక–జూన్25(మనం న్యూస్): మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన భూలక్ష్మి–మహాలక్ష్మి,బొడ్రాయి,దుర్గామాత విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించినందుకుగాను గ్రామ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డిని గ్రామ శివాలయ అర్చకులు రాజోజుల అశోక్‌చార్యులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంత రాములు, శ్రీను, కిరణ్, నాని, పెద్దులు, ప్రశాంత్, దూలం సురేష్, సరస్వతినాట్యమండలి కళాకారులు రామస్వామి ,కనకయ్య, స్వామి, సమ్మయ్య,రాజయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డి ముదిరాజు జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### బంగారు తెలంగాణలో జర్నలిస్టులపై దాడులు

### బీజేపీనేత కందుల సదానందం ముదిరాజ్



పెద్దపల్లి, జూన్ 25(మనం ప్రతినిధి): బంగారు తెలంగాణలో ప్రశ్నించే గొంతుకలు అణచివేయబడుతున్నాయని, బంగారు తెలంగాణలో జర్నలిస్టులపై దాడులు విపరీతమయ్యాయని బీజేపీ నేత కందుల సదానందం ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఎస్ఆర్ చానల్ కెమెరామెన్ అజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈదాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడియే కాకుండా ముదిరాజ్ సామాజిక వర్గం పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యాలు అత్యంత దారుణమని మండిపడ్డారు. గతంలో మహిళా గవర్నర్‌ను కించపరిచి బీఆర్ఎస్ నిజస్వరూపాన్ని చూపించిన కౌశిక్‌రెడ్డి, బీసి కులమైన ముదిరాజు జాతిని అవమానించి చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో 75లక్షల మురిరాజులు ఉన్నారని ఇది గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎంకేసీఆర్ పుట్టి ముంచుతామని హెచ్చరించారు. ముదిరాజులు జాతికి భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులపై చేసిన దాడికి, పాడి కౌశిక్‌రెడ్డి పై కిడ్నాప్, హత్యాయత్నం తదితర సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎక్కడా దొరికినా అడ్డుకుంటామని హెచ్చరించారు. బీసీలకు ఆర్థిక సహాయం కింద రూ. లక్ష ప్రకటించిన సీఎం కేసీఆర్ కుల ,ఆదాయ ధృవీకరణపత్రాల మంజూరును అడ్డుకొని బీసీలను మోసంచేశాడని దుయ్యబట్టారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు పిట్ట వినయ్, నక్క శ్రీనివాస్, రేగుల్ల సతీష్, పోచాలు, రేగుల్ల వినయ్, రాజేందర్, అంజి, సంతోష్‌లతో పాటుతదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడివో మల్లారెడ్డి మృతి తీరని లోటు

**- నివాళులర్పించిన జడ్పీ చైర్ పర్సన్, సిపిఐ నేతలు**



జగిత్యాల ప్రతినిధి, జూన్ 25 (మనం న్యూస్)ః జగిత్యాల జిల్లా బీర్పూర్ ఎంపిడిఓ కరివేద మల్లారెడ్డి మృతి పంచాయితీరాజ్ శాఖకు తీరనిలోటని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. సీనియర్ జర్నలిస్టు, బీర్‌పూర్ ఎంపిడిఓ కరివేద మల్లారెడ్డి వడదెబ్బ తగిలి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మరణించారు. విదేశాల్లో ఆయన చిన్న కుమారుడు వచ్చిన అనంతరం మల్లారెడ్డి అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత, జగిత్యాల అదనపు కలెక్టర్ మంద మకరంద్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొయిని అశోక్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డిలు మల్లారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ః మల్లారెడ్డి మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటు ః

ః జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి

కరివేద మల్లారెడ్డి పంచాయితీ రాజ్ శాఖలోనే గాకుండా పాత్రికేయ రంగలోను విశేష సేవలందించారని ఆయన మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటని జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి 1985 నుండి కొన్ని సంవత్సరాలపాటు ఉదయం, ఆంధ్రప్రభ దినపత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బీర్పూర్ ఎంపిడిఓ గా పనిచేస్తున్న మల్లారెడ్డి ఆపదవికే వన్నె తెచ్చారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మల్లారెడ్డి మృతిపట్ల కిషన్‌రెడ్డితో పాటు పాత్రికేయులు గుండేటి రాజు, తిరునగరి శ్రీనివాస్‌లు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

### ముదిరాజులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిల్లి శేఖర్ డిమాండ్



పెద్దపల్లి, జూన్ 25(మనం ప్రతినిధి): ముదిరాజ్ సామాజిక వర్గం పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సి పదవి నుండి తొలగించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిల్లి శేఖర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వాఖ్యాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాజీవ్ రహాదారిపై ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి, కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎమ్మెల్సీ తక్షణమే మురిరాజ్‌లకు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కౌశిక్‌పై తక్షణమే చర్యలు తీసుకొని పార్టీ నుండి బహిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈఆందోళనలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, పోతరవేన క్రాంతి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పిడుగు సంపత్,జిల్లా ఉపాధ్యక్షుడు తీగల సదయ్య, వేల్పుల సరోజన, పిడుగు కవిత, అనవేన సదయ్య, రెడ్డి శేఖర్, మల్లిఖార్జున్, జెట్టి సతీష్, రేండ్ల శ్రీనివాస్, పిడుగు భీమలింగు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## పాడి కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం



ఇల్లంతకుంట, జూన్ 25 (మనం న్యూస్)ః ముదిరాజ్ లపై పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలకు పాల్పడ్డ ఎమ్మెల్సీ కౌషిక్ రెడ్డి భేషరతుగా తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘ నాయకులు, ఆయా గ్రామాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# మాదిగల అభివృద్ధే లక్ష్యం

## మాదిగల వేదిక నాయకులు



మందమర్రి, జూన్ 25 (మనం న్యూస్): మాదిగ కుల బంధువుల అభివృద్ధి లక్ష్యంగా మాదిగల వేదిక ముందుకు సాగుతోందని మాదిగల వేదిక నాయకులు వెల్లడించారు. రాజకీయాల కతీతంగా మాదిగల అభివృద్ధి సాధించడం కోసమే మాదిగల వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో మాదిగ కుల బంధువుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతి అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల బాంధవులపై ఎవరైనా కించపరిచే విధంగా మాట్లాడినా, వేధించిన సంఘటితంగా పోరాటం చేయాలని తెలిపారు. మాదిగ కుటుంబాలతో కలిసి వనభోజనాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మాదిగ జాతి ప్రజల సంక్షేమం కోసం ఉద్యోగుల నుండి ప్రతినెలా 200 రూపాయల చందా రుసుము కూడా సేకరించనున్నట్లు వెల్లడించారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు కూడా ఈ వేదిక కృషి చేస్తుందని చెప్పారు. సభ్యులందరూ సంఘటితంగా ఉంటే మాదిగ జాతి అభివృద్ధి చెందుతుందని మాదిగల అభివృద్ధిని ఎవరు ఆపలేరని పేర్కొన్నారు. త్వరలోనే మందమర్రి పట్టణంలోఒక కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా దళితులకు వచ్చే హక్కుల కోసం సంఘం తరపున పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాది కుల బంధువుల వేదిక నాయకులు శనిగారపు కుమార్, కంపెల్లీ సమ్మయ్య, ఎన్ రాజలింగు,కొలుగురి విజయ్ కుమార్. దాసరి రాజనర్సు, రొడ్డ మోహన్, సంఘీ రవి, ఉప్పులేటి నరేష్. వాసాల సంపత్ ఆవునురి పోశం గరిగ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది

## మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు సుజాతా రెడ్డి



కరీంనగర్, జూన్ 25 (మనం న్యూస్): ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు డాక్టర్ పి.సుజాతరెడి పేర్కొన్నారు. మోడీ పాలనలో దేశం ఎదుగుతోన్న తీరును చూసే ప్రపంచ అగ్రదేశాలు ప్రధానికి సమున్నత గౌరవాన్ని అందిస్తున్నాయన్నారు. బిజెపి చేపడుతోన్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుజాతారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని జ్యోతినగర్‌లో గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ హయాంలో దేశ వ్యాప్తంగా అమలవుతోన్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం సుజాతరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో భారతావనిని అగ్రభాగాన నిలిపే విధంగా మోడీ పాలన కొనసాగుతోందని కొనియాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి బాటన పయనిస్తున్నాయన్నారు. ప్రమాదకర కోవిడ్ సమయంలో మోడీ ఆలోచనలతో ప్రపంచ దేశాలకు చేయూతనందించిన మన దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని ఆమె గుర్తు చేశారు. అన్ని రంగాలను అభివృద్ధి పరుస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోన్న బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బాసటగా నిలవాలని సుజాత రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా నాయకులు రాగుల లక్ష్మి, పాముల జ్యోతి, స్వర్ణ, మేకల మల్లమ్మ, కళ్లపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయి

మంచిర్యాల జూన్ 25 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకుల ఆగాడాలు, భూకబ్జాలు, మహిళలపై అత్యాచారాలు పరంపర మితిమీరుతున్నాయని మాజీ మంత్రి, పిసిసి కార్యదర్శి గడ్డం వినోద్ వెంకటస్వామి ఆరోపించారు. ఆదివారం తాండూర్ మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి.ఇషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల నాయకుల విస్తృతస్థాయి సమావేశానికి వినోద్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలి భూకబ్జాలకు, దోపిడీలకు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఎదిరించిన, విమర్శించిన పార్టీల నాయకులను, కార్యకర్తలను అక్రమ కేసులు నమోదు చేస్తూ జైళ్ళ పాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రైతులకు వ్యవసాయం కోసం భూములను పంపిణీ చేసిన భూములను, నేడు బిఆర్ఎస్ ప్రభుత్వం అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు అని స్వాధీనం చేసుకొని కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల ప్రజా సంక్షేమ పథకాలు అందించినట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు ఆ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మాత్రమే చెందుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు మహిళలపై అత్యాచారాలు దాడులకు పాల్పడుతూ వార్తల్లోకి వస్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక మహిళ పట్ల వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనమని వినోద్ వ్యాఖ్యానించారు. ఆ మహిళకు బిఆర్ఎస్ నాయకులు కానీ ప్రజా ప్రతినిధులు, ఎంపీలు న్యాయం చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు మూడు ఎకరాల భూమి అందలేదని, అలాగే డబుల్ బెడ్ రూములు అందలేదని, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ లలో అవినీతి రాజ్యమేలుతుందని అలాగే దళిత బంధు పథకంలో కమిషన్ల పేరిట బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు లక్షల రూపాయలు కమిషన్ల రూపంలో తీసుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రజల ఉద్యోగుల నిరుద్యోగుల కార్మికుల కష్టాలను స్వయంగా చూసిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో కేవలం కెసిఆర్ కుటుంబమే బాగుపడ్డదని తెలంగాణ ప్రజలకు నిరుద్యోగులకు విద్యార్థులకు ఎలాంటి న్యాయం జరగలేదని గుర్తు చేశారు. తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాబోయే ఎన్నికల్లో మద్దతు పలికి, సోనియా గాంధీకి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం కిష్టంపేట ఎస్టి కాలనీలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కారుకూరి రామచందర్, ఎం సూరిబాబు, ముచ్చర్ల మల్లయ్య, సంగతి సత్యనారాయణ, రత్నం ప్రదీప్, బండి రాము,ఆనంద్,హరీష్, విజయ్,గాలి శ్రీనివాస్, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జైన సాంబయ్య, కామని శ్రీనివాస్, ఎండి జుబేర్, శాలిగామ మల్లేష్, చాంద్ ఖాన్, ఖమ్మం నాగేష్, సుందిళ్ల భూమయ్య జాడి అశోక్ మోతుకుల రాజేష్ రేగుల సదయ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు కొండంత అండ బిఆర్ఎస్

## చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు, జూన్ 26 (మనం న్యూస్): పార్టీ కార్యకర్తలకు బిఆర్ఎస్ కొండంత అండగా ఉంటుందని చొప్పదండి శాసనసభ్యులు సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు.రామడుగు మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన ఈరెల్లి రాజశేఖర్ ఇటీవల ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోగా, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాద బీమా కింద రెండు లక్షల రూపాయల విలువ చేసే చెక్కును ఆదివారం వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమాను మొదటగా ప్రవేశపెట్టిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ అన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్క కార్యకర్త పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాడ ప్రసూన శేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంటల జితేందర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నరేందర్ రెడ్డి మాజీ ఎంపీపీ మారుకొండ కిష్టారెడ్డి, నాయకులు ఒంటెల రమణారెడ్డి, లంక మల్లేశం, పూడూరు మల్లేశం, ఎడవెల్లి పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మనం కావలెను
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు
పెద్దపల్లి : పెద్దపల్లి టౌన్ & రూరల్, జూలపల్లి, పాలకుర్తి, అంతర్గాం, గోదావరిఖని టౌన్, జ్యోతినగర్, రామగుండం, 8 ఇన్ క్లైయిన్ కాలని, కమాన్‌పూర్
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
రాజన్న సిరిసిల్ల : వేములవాడ (ఆర్.సి), వేములవాడ టౌన్ & రూరల్, కోనారావుపేట, రుద్రంగి, చందుర్తి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట.
జగిత్యాల : జగిత్యాల టౌన్ & క్రైమ్, మేడిపెల్లి, కోరుట్ల రూరల్, ఇబ్రహీంపట్నం, గొల్లపల్లి, సారంగాపూర్, మల్యాల, కొడిమ్యాల

మనం జనం కోసం... అక్షర యజ్ఞం... తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076

- Friends Digitals, KNR - 7989030554